కారుకు అంత్యక్రియలు

అమ్రేలి, నవంబర్ 8: గుజరాత్‌లోని అమ్రేలి జిల్లాలో ఓ రైతు కుటుంబం తమ కారుకు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించింది. సాధువులు, ఆధ్యాత్మిక గురువులు సహా 1,500 మంది ప్రజల సమక్షంలో సంజయ్ పోలారా కుటుంబం పదర్‌షింగా గ్రామంలోని తమ పొలంలో గురువారం హిందూ సంప్రదాయం ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించింది. మొదట 12 ఏండ్ల పాటు వాడిన వాగన్ ఆర్ కారును పూలతో అలంకరించి ఇంటి నుంచి పొలం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పోలారా కుటుంబం వేద మంత్రోచ్చారణల నడుమ కారును15 అడుగుల గోతిలో పూడ్చి పెట్టారు. సూరత్‌లో నిర్మాణ వ్యాపారం చేసే పోలారా తమ కుటుంబానికి అదృష్టాన్ని తీసుకొచ్చిన కారు కోసం ఏదైనా విభిన్నంగా చేయాలనుకున్నారు. తద్వారా భవిష్యత్తు తరాలు ఆ కారును గుర్తుంచుకొంటాయని భావించారు. ఇందు కోసం తన కారుకు రూ.4 లక్షలు ఖర్చు చేసి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. 'ఈ కారు మాకు సంపద తీసుకొచ్చింది. దీని వల్ల వ్యాపారంలో విజయం లభించింది. మా కుటుంబానికి గౌరవం వచ్చింది. అందుకే దీన్ని అమ్మడం కన్నా, దీనికి సమాధిని నిర్మించడం ద్వారా నివాళి అర్పించాను' అని పోలారా తెలిపారు.

పురుష టైలర్లు మహిళల కొలతలు తీయరాదు

లక్నో, నవంబర్ 8: టైలరింగ్ షాపుల్లో ఇక నుంచి మహిళల దుస్తుల కొలతలు పురుష టైలర్లు తీసుకోరాదని ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ ప్రతిపాదించింది. అంతేకాకుండా జిమ్‌ల్లో మహిళలకు పురుషులు శిక్షకులుగా వ్యవహరించకూడదని, మహిళల జుట్టును కత్తిరించకూడదని తాము ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నట్టు తెలిపింది. బ్యాడ్ టచ్‌తో పాటు మహిళల పట్ల పురుషుల దురుద్దేశాలను అరికట్టడానికి ఈ ప్రతిపాదనలు చేసినట్టు యూపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బబితా చౌహాన్ తెలిపారు. జిమ్‌లు, కోచింగ్ కేంద్రాలు, బట్టల దుకాణాలలో సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, స్కూల్ బస్సులలో భద్రత కోసం ఒక మహిళను ఉంచాలని గత నెల 28న నిర్వహించిన సమావేశంలో ప్రతిపాదించామన్నారు. టైలరింగ్ షాపులు, మహిళా బొటిక్‌ల్లో కొలతలు తీస్తున్నప్పుడు, జిమ్‌లు, యోగా కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నప్పుడు పురుషుల నుంచి 'బ్యాడ్ టచ్'ను ఎదుర్కొంటున్నామని అత్యధికంగా ఫిర్యాదులు వచ్చినట్టు ఆమె చెప్పారు. దీనిని నివారించడానికి టైలర్ పురుషుడు అయినప్పటికీ కొలతలు మాత్రం మహిళే తీయాలని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలు అమలు చేసేలా చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించనున్నట్టు ఆమె తెలిపారు.

కొంపముంచిన 'ఓకే'!

విశాఖపట్టణం: 'ఓకే' అన్న రెండక్షరాల పదం ఓ దాంపత్య జీవితంలో నిప్పులు పోసి, భారతీయ రైల్వేకు అక్షరాలా మూడు కోట్ల రూపాయల నష్టాన్ని తెచ్చిపెట్టింది. నమ్మశక్యం కాకున్నా ఇది నిజం. విశాఖపట్టణానికి చెందిన రైల్వే స్టేషన్ మాస్టర్ అక్టోబర్ 12, 2011న చత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌కు చెందిన మహిళను వివాహం చేసుకున్నారు. ఒకరోజు స్టేషన్ మాస్టర్ విధుల్లో ఉండగా ఫోన్ చేసిన భార్య వాగ్వివాదానికి దిగింది. దీంతో అతడు.. 'ఓకే, మనం ఇంటి దగ్గర మాట్లాడుకుందాం' అని ఫోన్ పెట్టేశాడు. సరిగ్గా ఇదే అతడి కొంప ముంచింది. అదే సమయంలో రేడియో ట్రాన్స్‌మిషన్‌ను పట్టుకుని ఉన్న మరో స్టేషన్‌లోని స్టేషన్ మాస్టర్‌కు 'ఓకే' అన్న పదం వినిపించడంతో ఆయన తప్పుగా అర్థం చేసుకున్నారు. గూడ్స్ రైలు డిస్పాచ్‌కు ఆయన 'ఓకే' చెప్పారనుకుని భావించి రైలుకు సిగ్నల్ ఇచ్చారు. ఆ రైలు మావోయిస్టు ప్రభావిత నిషిద్ధ ప్రాంతం గుండా బయలుదేరింది. రాత్రి పరిమితులను ఉల్లంఘించి అనధికారిక మార్గంలో రైలు ప్రయాణించినందుకు గాను రైల్వే రూ. 3 కోట్ల జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా స్టేషన్ మాస్టర్ సస్పెండయ్యారు. దీనంతటికీ భార్యే కారణమని భావించిన స్టేషన్ మాస్టర్ భార్య నుంచి విడాకులు కావాలంటూ కోర్టుకెక్కారు. మరోవైపు, భర్త, అతని కుటుంబ సభ్యులు తనను హింసిస్తున్నారంటూ ఆయన భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఈ కేసును దుర్గ్ ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేసింది. అక్కడ విడాకుల పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో స్టేషన్ మాస్టర్ ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత తాజాగా హైకోర్టులో స్టేషన్ మాస్టర్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. వివాహమైన తర్వాత కూడా ఆమె తన మాజీ లవర్‌తో సంబంధం కొనసాగిస్తున్నదని, అందులో భాగంగానే భర్త, కుటుంబ సభ్యులపై అదనపు కట్నం, హింస ఆరోపణలు చేస్తున్నదని గుర్తించిన న్యాయస్థానం విడాకులు మంజూరు చేసింది. భార్య ప్రవర్తన క్రూరంగా ఉందని, ఆమె చర్యలు భర్తను మానసిక క్షోభకు గురిచేశాయని, రైలు ఘటనకు భార్యే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది.

12 నెలల్లో 4 వేల ఏటీఎంలు మూత

నెట్‌వర్క్‌ను తగ్గిస్తున్న బ్యాంకులు

డిజిటల్ లావాదేవీల పెరుగుదలే కారణం

న్యూఢిల్లీ, నవంబర్ 8: దేశంలో నగదు చలామణి రికార్డు స్థాయికి పెరిగినప్పటికీ దేశీయ బ్యాంకులు తమ ఏటీఎం నెట్‌వర్క్‌లను తగ్గిస్తున్నాయి. దీంతో గత 12 నెలల వ్యవధిలో ఏకంగా 4 వేల ఏటీఎంలు మూతపడ్డాయి. దేశంలో డిజిటల్ చెల్లింపులు నానాటికీ పెరగుతుండటమే ఇందుకు కారణం. నిరుడు సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా 2.19 లక్షల ఏటీఎంలు ఉండగా ఈ ఏడాది వాటి సంఖ్య 2.15 లక్షలకు తగ్గినట్టు రిజర్వు బ్యాంకు వెల్లడించింది. డిజిటల్ చెల్లింపులకు ఆదరణ పెరుగుతుండటంతో బ్యాంకులు సంప్రదాయ ఏటీఎంలపై ఫోకస్ తగ్గించి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లాంటి డిజిటల్ మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి సారిస్తున్నాయి. భౌతిక, డిజిటల్ మౌలిక వసతులను ఏకీకృతం చేయడం ద్వారా బ్యాంకులు తమ నెట్‌వర్క్‌ను తగ్గిస్తున్నాయని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ ధోరణి అధికంగా ఉన్నదని ఏజీఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్ సంస్థ చైర్మన్ రవి బీ గోయల్ తెలిపారు. ఇప్పటికే దేశంలో చాలా ఏటీఎంలు మూతపడటంతో ప్రస్తుతం ప్రతి లక్ష మంది ప్రజలకు 15 చొప్పున ఏటీఎంలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో నగదు వినియోగానికి, ఏటీఎంల లభ్యతకు మధ్య తీవ్ర అసమతుల్యత కొనసాగుతున్నది.

పదేండ్ల మల్టిపుల్ ఎంట్రీ వీసాలు రద్దు!

పాలసీని సవరించిన కెనడా

టొరంటో, నవంబర్ 8: కెనడా ప్రభుత్వం తన వీసా పాలసీని సవరించింది. 10 ఏండ్ల పాటు చెల్లుబాటయ్యేలా గతంలో అమలు చేసిన దీర్ఘకాలిక బహుళ ప్రవేశ పర్యాటక వీసాను జారీ చేసే విధానంలో మార్పు చేసింది. కొత్త నిబంధలన ప్రకారం పర్యాటకులకు ఏ విధమైన వీసాను జారీ చేయాలి, దానికి ఎంత గడువు నిర్దేశించాలి అన్న విషయాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులే నిర్ధారిస్తారు. దీంతో ఇకపై 10 ఏండ్ల దీర్ఘకాలపు వీసాల జారీ ఉండకపోవచ్చు. గతంలో ప్రభుత్వం సింగిల్, మల్టిపుల్ ఎంట్రీ వీసాలు జారీ చేసేది. మల్టిపుల్ ఎంట్రీ వీసాలు కలిగిన వారు ఆ నిర్దేశించిన 10 ఏండ్ల కాలంలో కెనడాకు ఎన్నిసార్లయినా రాకపోకలు సాగించవచ్చు. ఇలా మల్టిపుల్ వీసా తీసుకుని దేశంలో ఉంటున్న లక్షలాది మంది నివాసితులను దేశం నుంచి పంపే యోచనలో కెనడా ప్రభుత్వం ఉందని వార్తలొస్తున్నాయి.

పౌరసత్వంపై పరేషాన్

అమెరికాలో జన్మించినా పౌరసత్వం కష్టమే!

మొదటిరోజే నిర్ణయం తీసుకోనున్న ట్రంప్..

పిల్లలపై తల్లిదండ్రుల్లో మొదలైన బెంగ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవడంతో వలస విధానంపై ఆయన ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అనే ఆందోళన అమెరికాకు వలస వెళ్లిన వారిలో నెలకొన్నది. ముఖ్యంగా తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం దక్కడంపై అనిశ్చితి నెలకొంటుందనే భయం వలస వెళ్లిన వారిలో మొదలైంది. అమెరికాలో జన్మించిన పిల్లలకు జన్మతా అక్కడి పౌరసత్వం లభిస్తుంది. దీనిని నాచురలైజ్డ్ సిటిజన్‌షిప్ అంటారు. అయితే, తాము గెలిస్తే మొదటి రోజే నాచురలైజ్డ్ సిటిజన్‌షిప్‌ను ఎత్తేస్తామని తమ ఎన్నికల ప్రచారంలో డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. వారి ప్రచార పత్రాల్లోనూ ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. 'ఇక మీదట అమెరికాలో జన్మించే పిల్లలకు జన్మతా పౌరసత్వం రావాలంటే తల్లిదండ్రుల్లో ఒక్కరైనా కచ్చితంగా అమెరికా పౌరులై లేదా చట్ట ప్రకారం అమెరికా శాశ్వత నివాసితులై ఉండాలని ఆదేశాలు ఇస్తాం' అంటూ ట్రంప్ ఎన్నికల ప్రచార పత్రంలో పేర్కొన్నారు. ప్రచారంలో చెప్పినట్టు ఆయన ఈ నిర్ణయం తీసుకుంటే ఇక మీద అమెరికాకు వలస వెళ్లిన వారి పిల్లలకు జన్మతా పౌరసత్వం దక్కదు.

ట్రంప్ ప్రచార సారథికి కీలక పదవి

తన ఎన్నికల ప్రచార మేనేజర్ సూసీ వైల్స్‌ను వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నిర్ణయిస్తూ అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి ఆమె కీలక పాత్ర పోషించారు. అమెరికా చరిత్రలో తొలిసారి ఒక మహిళ చీఫ్ ఆఫ్ స్టాఫ్ కావడం విశేషం. కాగా, ట్రంప్ తన విజయ ప్రసంగంలో ఆమెకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినా ఆమె నిరాకరించారు. ఫ్లోరిడాకు చెందిన సూసీ చాలాకాలంగా రిపబ్లికన్ వ్యూహకర్తగా ఉన్నారు. 2016, 2020ల్లో రాష్ట్రంలో ట్రంప్ ప్రచార బాధ్యతలను చేపట్టారు. గతంలో ఆమె యుటా మాజీ గవర్నర్ జాన్ హంట్స్‌మన్ 2012 అధ్యక్ష ప్రచారానికి మేనేజర్‌గా పనిచేశారు.

ట్రంప్‌నకు ఓటేసిన మగాళ్లతో బ్రేకప్

- **వారిని పెండ్లి చేసుకోం.. వారితో పిల్లల్ని కనం**
- **అమెరికాలో మహిళల '4బీ ఉద్యమం'**

వాషింగ్టన్: ఒకవైపు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయాన్ని ఆయన మద్దతుదారులు పండుగలా జరుపుకుంటుండగా, మరోవైపు కొందరు అమెరికన్ మహిళలు సోషల్ మీడియా వేదికగా కొత్త ఉద్యమానికి నాంది పలికారు. రెండు రోజులుగా కొందరు యువతులు, మహిళలు '4బీ ఉద్యమం' ప్రారంభించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో దీనికి సంబంధించి పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ గెలుపుతో మహిళల హక్కులకు భంగం వాటిల్లుతుందని వీరు భావిస్తున్నారు. అబార్షన్ హక్కులు, లింగ సమానత్వం, అమెరికా ప్రజాస్వామ్య భవిష్యత్తు పట్ల సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్‌ను గెలిపించి తమ హక్కులను ప్రమాదంలో పడేసిన మగవారిని శిక్షించాలని నిర్ణయించారు. ఈ ఆలోచనలో భాగంగా పుట్టుకొచ్చిందే ఈ '4బీ ఉద్యమం'.

4బీ ఉద్యమం అంటే...

4బీ అంటే.. నో బేబీస్, నో బాయ్‌ఫ్రెండ్స్, నో బ్రాంచెస్, నో బైండింగ్. ట్రంప్‌నకు ఓటేసిన వారితో పిల్లలను కనబోమని, వారితో డేటింగ్ చేయబోమని, ఎలాంటి బంధాలను కొనసాగించబోమని, శారీరకంగా కలవబోమనేది ఈ నినాదం వెనుక ఉన్న అర్థం. కొందరు దీనిని 'సెక్స్ స్ట్రైక్' అని కూడా అంటున్నారు. ట్రంప్‌నకు ఓటేసిన పురుషులకు ఇది తాము విధించే శిక్ష అని, ట్రంప్ అధ్యక్షుడిగా కొనసాగనున్న నాలుగేండ్లు తాము ఈ ప్రతిజ్ఞకు కట్టుబడి ఉంటామని చెప్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఈ నాలుగేండ్లు తాము ఎలాంటి రిలేషన్‌షిప్‌లో ఉండబోమని చెప్తూ ఫోన్లలో డేటింగ్ యాప్‌లను డిలీట్ చేస్తున్నారు. ట్రంప్ అధ్యక్షకాలంలో తాను సింగిల్‌గా ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్న ఓ యువతి వీడియో వైరల్‌గా మారింది.

ఏఎంయూ మైనారిటీ హోదా కేసు

మరో బెంచ్‌కు బదిలీ

ఇది మైనారిటీ సంస్థ కాదని 1967లో ఇచ్చిన తీర్పు రద్దు

న్యూఢిల్లీ: అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం (ఏఎంయూ) మైనారిటీ హోదాపై విచారణ బాధ్యతను నూతన ధర్మాసనానికి సుప్రీంకోర్టు శుక్రవారం అప్పగించింది. అయితే, ఏఎంయూను కేంద్ర చట్టం ద్వారా ఏర్పాటు చేసినందువల్ల దానిని మైనారిటీ సంస్థగా పరిగణించరాదని 1967లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం 4:3 మెజారిటీ తీర్పునిచ్చింది. ఏఎంయూకు మైనారిటీ హోదా ఇవ్వడానికి పరిశీలించవలసిన అంశాలను నిర్దేశించింది. ప్రస్తుత తీర్పులో నిర్దేశించిన అంశాల ఆధారంగా ఏఎంయూ మైనారిటీ విద్యా సంస్థ హోదాపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ కేసు రికార్డులను రెగ్యులర్ బెంచ్‌కు సమర్పించాలని తెలిపింది. అలహాబాద్ హైకోర్టు 2006లో ఇచ్చిన తీర్పుపై అపీళ్లను ఆ బెంచ్ విచారిస్తుందని తెలిపింది.

మీడియా స్వేచ్ఛ అంటే నేరంపై

తీర్పులివ్వడానికి లైసెన్స్ కాదు

కేరళ హైకోర్టు

కొచ్చి: మీడియా సంస్థలు సంయమనం పాటించాలని కేరళ హైకోర్టు చెప్పింది. దర్యాప్తులు, క్రిమినల్ కేసులపై విచారణ సమయంలో రిపోర్టింగ్ చేసేటపుడు దర్యాప్తు లేదా జ్యుడిషియల్ అధికారుల పాత్రను చేపట్టకుండా సంయమనం పాటించాలని తెలిపింది. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఏ) ప్రకారం వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ అనేవి ప్రాథమిక హక్కులు అని; నిందితుడి అపరాధం లేదా అమాయకత్వం గురించి చట్టబద్ధమైన అధికారులు ఓ నిర్ణయానికి రావడానికి ముందే, ఆ నిందితుడి అపరాధం లేదా నిర్దోషిత్వం గురించి ప్రకటించేందుకు ఈ హక్కులు మీడియాకు లైసెన్స్ కాదని వివరించింది.

వచ్చే ఎన్నికల్లో కెనడా ప్రధాని ఓటమి

ఎలాన్ మస్క్ జోస్యం

న్యూఢిల్లీ: కెనడా ప్రధాని ట్రూడో రాజకీయ భవిష్యత్తుపై టెస్లా అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆయన ఓడిపోయి, ప్రధాని పదవిని పోగొట్టుకుంటారని తెలిపారు. ఒక యూజర్ ఎక్స్‌లో అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ప్రభుత్వ పర్యవేక్షణ కోసం ఆన్‌లైన్ స్ట్రీమింగ్ సేవాసంస్థలు తప్పక నమోదు చేయాలంటూ కెనడా ప్రభుత్వం తెచ్చిన నిబంధన వాక్ స్వాతంత్ర్య హక్కుకు భంగం కలిగిస్తుందని ఇటీవల ట్రూడోపై ఎలాన్ మస్క్ విమర్శలు చేశారు. మైనారిటీలో ఉన్న ట్రూడో ప్రభుత్వం సొంత పార్టీ నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నది.

ఇజ్రాయెల్ సాకర్ అభిమానులపై దాడి

ఆమ్‌స్టర్‌డామ్: నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌లో గురువారం రాత్రి పాలస్తీనా అనుకూల బృందం ఇజ్రాయెల్ సాకర్ అభిమానులపై దాడి చేసినట్టు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వారిని అక్కడి నుంచి తరలించేందుకు రెండు విమానాలను పంపించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అధికారులను ఆదేశించారు. మక్కాబీ టెల్ అవీవ్ జట్టు అజక్స్ ఆమ్‌స్టర్‌డామ్ జట్టు చేతిలో ఫుట్ బాల్ మ్యాచ్ ఓడిపోయాక, నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇజ్రాయెలీలపై దుండగులు దాడి చేశారు. పాలస్తీనాకు స్వేచ్ఛ ఇవ్వండి అని నినాదాలు చేశారు. ఈ దాడుల్లో కనీసం 10 మంది గాయపడ్డారు.

మణిపూర్‌లో మరో దారుణం

మహిళను రేప్ చేసి సజీవ దహనం

గువాహటి, నవంబర్ 8: అశాంతితో రగులుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. స్కూల్ టీచర్, ముగ్గురు పిల్లల తల్లి అయిన హ్మార్ జాతికి చెందిన ఒక మహిళను సాయుధులైన కొందరు దుండగులు అత్యాచారం జరిపి సజీవ దహనం చేశారు. వీరు మైతీ జాతీయులుగా బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిరిబామ్ జిల్లాలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కాలిపోయి ఉన్న 31 ఏండ్ల మహిళ మృతదేహాన్ని స్థానిక సంస్థలు స్వాధీనం చేసుకున్నాయని, ఈ ఘటనకు ప్రతీకారంగా కాల్పులు, గృహ దహనాలు చోటు చేసుకున్నాయని అధికారులు చెప్పారు. కాగా, దీనిపై పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే బాధితురాలి మృతదేహానికి పొరుగు రాష్ట్రమైన అస్సాంలోని సిల్చార్‌లో పోస్టుమార్టం చేసేందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా మేజిస్ట్రేట్‌కు జిల్లా ఎస్పీ లేఖ రాశారు.

సమోసాలు పోయాయని సీఐడీ విచారణ

- **ముఖ్యమంత్రి కార్యక్రమంలో సమోసాలు మిస్సింగ్**
- **హిమాచల్‌లో సరికొత్త వివాదం**
- **కాంగ్రెస్ సర్కారు తీరు పట్ల విమర్శలు**

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం మరో వివాదానికి తెరలేపింది. సమోసాలు పోయాయని ఏకంగా సీఐడీతో విచారణ చేయిస్తున్నది. దీనిపై పెద్ద ఎత్తున రాజకీయ విమర్శలు, వెక్కిరింతలు వస్తున్నాయి. అక్టోబర్ 21న సిమ్లాలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కోసమని సీఐడీ మూడు బాక్సుల సమోసాలను ఆర్డర్ ఇచ్చింది. అయితే, ఈ సమోసాలు కార్యక్రమం వద్దకు రాకుండానే దారిమళ్లాయి. దీంతో సీఐడీ ఉన్నతాధికారులు ఈ అంశంపై విచారణ జరిపిస్తున్నారు. ఈ విచారణపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. సమోసాలపై సీఐడీ విచారణ చేపట్టడం తెలివి తక్కువ తనమని, ప్రజా వ్యతిరేకమని మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ విమర్శించారు. 'సమోసాలు పోయాయని ఉన్నతాధికారులతో విచారణ చేపట్టడం హాస్యాస్పదం. పలు శాఖల్లో భారీ కుంభకోణాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వాటిపై దృష్టి పెట్టాలి.' అని బీజేపీ ఎమ్మెల్యే సత్పాల్ సింగ్ సట్టి పేర్కొన్నారు.

సమోసాలపై విచారణ కాదు: సీఎం సుఖు

సీఐడీ సిబ్బంది దుష్ప్రవర్తనపైనే విచారణ జరుగుతున్నదని, కానీ సమోసాలపై అంటూ వార్తలు ప్రసారం చేస్తున్నారని ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు పేర్కొన్నారు. కాగా, ఇది పూర్తిగా సీఐడీ అంతర్గత వ్యవహారమని, రాజకీయం చేయొద్దని సీఐడీ డీజీ సంజీవ్ రంజన్ ఓఝా పేర్కొన్నారు. 'ముఖ్యమంత్రి సమోసాలు తినరు. మేము ఎవరికీ నోటీసులు ఇవ్వలేదు. కేవలం ఏం జరిగిందో తెలుసుకోవాలని మాత్రమే చెప్పాం.' అని ఆయన పేర్కొన్నారు.

కెనడాలో ఖలిస్థానీ మద్దతుదారులున్నది నిజమే

అంగీకరించిన ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో

టొరంటో, నవంబర్ 8: కెనడా-భారత్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న పరిస్థితుల్లో.. వివాదానికి కారణమైన ఖలిస్థానీల గురించి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక ప్రకటన చేశారు. ఖలిస్థానీ మద్దతుదారులు కెనడాలో ఉన్నారని అంగీకరించారు. ఒట్టవాలోని పార్లమెంట్ హిల్‌లో ఇండో కెనడియన్లతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఆయన తమ ప్రభుత్వం ఖలిస్థానీ అతివాదులకు స్వర్గధామంగా ఉందని భారత్ చేసిన ఆరోపణలను పరోక్షంగా అంగీకరిస్తూ కెనడాలో ఖలిస్థానీ మద్దతుదారులు ఉన్నమాట వాస్తవమేనని చెప్పారు. ఇటీవల ట్రూడో చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు కారణంగానే ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. కాగా, ఖలిస్థానీల పట్ల ట్రూడో వైఖరి వారిలో సాధికారిత కల్పిస్తూ, ఆధునిక సిక్కుల్లో భయం పుట్టిస్తున్నదని రెండు రోజుల క్రితం సిక్కు, మాజీ మంత్రి ఉజ్జల్ దోసంజ్ విమర్శించారు.

బాధపెట్టి ఉంటే మన్నించండి

- **వీడ్కోలు సమావేశంలో సీజేఐ భావోద్వేగం**
- **10న పదవీ విరమణ**
- **బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా**

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయనున్న జస్టిస్ డీవై చంద్రచూడ్ భావోద్వేగానికి గురయ్యారు. ఆదివారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని ఉద్దేశించి జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. 'ఎవరినైనా బాధపెట్టి ఉంటే నన్ను మన్నించమని కోరుతున్నా' అని ఆయన పేర్కొన్నారు. 'ఈ వ్యవస్థలో అత్యధికంగా ట్రోలింగ్ ఎదుర్కొన్న వ్యక్తిని, న్యాయమూర్తిని నేను' అని ఆయన అన్నారు. 'అవసరంలో ఉన్న వారికి సేవ చేయలిగే స్థితిలో ఉండటం కంటే గొప్ప అనుభూతి ఉండదు. జస్టిస్ సంజీవ్ ఖన్నా లాంటి దృఢమైన, గౌరవప్రదమైన, అంకితభావం కలిగిన వ్యక్తి సీజేఐగా బాధ్యతలు తీసుకుంటున్నందున నేను కోర్టును వీడుతున్నా ఎలాంటి తేడా ఉండబోదు' అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

ఆయన రికార్డును ఎవరూ చెరిపేయలేరు: జస్టిస్ సంజీవ్ ఖన్నా

సుప్రీంకోర్టును మరింత మెరుగుపర్చాలనే లక్ష్యంతో జస్టిస్ డీవై చంద్రచూడ్ పని చేశారని జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. ఆయన 38 రాజ్యాంగ ధర్మాసన తీర్పులు ఇచ్చారని ఈ రికార్డును ఎవరూ అధిగమించలేరని పేర్కొన్నారు.

పదవీకాలంలో కీలక తీర్పులు

జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబర్ 8న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థించడం, ఎన్నికల బాండ్లను రద్దు చేయడం, జైల్ మాన్యువళ్లలో కులవివక్షను రద్దు చేయడం, స్వలింగ వివాహాలకు చట్టబద్ధతను నిరాకరించడం వంటి కీలక తీర్పులు ఆయన నేతృత్వంలోని ధర్మాసనాలు ఇచ్చారు. కళ్లకు గంతలు తొలగించి, చేతిలో ఖడ్గం బదులు రాజ్యాంగంతో న్యాయదేవతకు కొత్త రూపాన్ని ఇవ్వడంలో కీలకంగా వ్యవహరించారు.

సుపారీ కోసం పోలీసులకు కాంట్రాక్ట్ కిల్లర్ ఫిర్యాదు

లాయర్ హత్యకు రూ.20 లక్షల సుపారీ

అడ్వాన్స్‌గా రూ.1 లక్ష, మిగిలిన సొమ్ము ఎగవేత

హత్య కేసును తిరిగి తెరచిన పోలీసులు

లక్నో : హత్య చేయడానికి కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయలేదని ఓ కాంట్రాక్ట్ కిల్లర్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో గత ఏడాది జరిగిన హత్యకు సంబంధించిన కేసును పోలీసులు తిరిగి తెరిచారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం, టీపీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న న్యాయవాది అంజలి గార్గ్‌ను హత్య చేయడానికి నీరజ్ శర్మ అనే కాంట్రాక్ట్ కిల్లర్‌తో కొందరు వ్యక్తులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆమెను హత్య చేస్తే రూ.20 లక్షలు ఇస్తామని చెప్పారు. ముందుగా రూ.1 లక్ష చెల్లించారు. అంజలిని 2023 జూన్ 7న ఇద్దరు వ్యక్తులు హత్య చేశారు. మాజీ భర్త పేరు మీద ఉన్న ఇంట్లో ఆమె నివసించేవారు. ఆ ఇంటిని యశ్‌పాల్, సురేశ్‌లకు అతని బంధువులు అమ్మేసినప్పటికీ ఆమె ఖాళీ చేయడానికి తిరస్కరించారు. దీంతో వివాదం ప్రారంభమైంది. పోలీసులు మృతురాలి మాజీ భర్త, అతని బంధువులను కస్టడీలోకి తీసుకుని, ఆ తర్వాత విడిచిపెట్టారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఇంటిని కొన్నవారే అంజలిని హత్య చేయడానికి నీరజ్ శర్మ, మరో ఇద్దరితో కాంట్రాక్ట్ కుదుర్చుకున్నట్లు వెల్లడైంది. వెంటనే పోలీసులు శర్మతోపాటు ఇద్దరు హంతకులను, యశ్‌పాల్, సురేశ్‌లను అరెస్ట్ చేశారు. శర్మ ఇటీవల